సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం ; 22 ; ఏప్రిల్ ; 2025



కొత్త క్వార్టర్లు నిర్మించేనా..?

రాష్ట్రానికి వెలుగులు పంచే పాల్వంచ కేటీపీఎస్ ఉద్యోగుల నివాస సముదాయాలు శిథిలావస్థకు చేరడంతో ఇబ్బంది పడుతున్నారు. 8లో



అకాల వర్షం.. తడిసిన ధాన్యం

జిల్లాలో కురిసిన అకాల వర్షంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నానికి తీవ్రంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరించిన జడ్జి కవిత



జిల్లా జడ్జికి మొక్క అందజేస్తున్న కవిత

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులైన కర్నాటి కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాదిన్నరగా ఈ పోస్టు ఖాళీగా ఉండగా హైదరాబాద్ నాంపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి బదిలీపై వచ్చిన కవిత నియమితులయ్యారు. భాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

నేడు పెద్దమ్మగుడి పాలకవర్గ ప్రమాణ స్వీకారం

పాల్వంచరూరల్ : ఎట్టకేలకు పెద్దమ్మగుడి పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. మంగళవారం ఉదయం 11 గంటలకు నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 19న పాలకమండలి జాబితాను ప్రభుత్వం జారీ చేయగా.. స్థానికులకు కమిటీలో అవకాశం కల్పించాలంటూ కొందరు ఆందోళన చేయడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిలిచిపోయింది. దీంతో ఈఓ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తుతో నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని ఈఓ వెల్లడించారు.

మే 1 నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: మే 1వ తేదీ నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని, ఇందుకోసం అందరూ సిద్ధంగా ఉండాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా సోమవారం హైదరాబాద్ నుంచి జూమ్ సమావేశం నిర్వహించగా జిల్లా నుంచి డీఈఓ హాజరయ్యారు. అనంతరం వివిధ విభాగాల కో – ఆర్డినేటర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం పాఠశాల పని దినాలు నష్టపోకుండా వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా, మండల రిసోర్స్ పర్సన్ల ఎంపికకు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని వేసవి సెలవుల్లో కూడా కొనసాగించాలని ఆదేశించారు. పీఎం శ్రీకి ఎన్నికైన పాఠశాలలకు విడుదలైన నిధుల వినియోగంపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా బడిబాటను విజయవంతం చేయాలని, ఇందుకోసం ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్లు ఎ.నాగరాజ శేఖర్, ఎస్కే సైదులు, జె.అన్నామణి, ఎఫ్ఏఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..

మండల, జిల్లాస్థాయిలో రిసోర్స్ పర్సన్లుగా పని చేసేందుకు ఆసక్తి గల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈనెల 24వ తేదీ లోపు నిర్ణీత నమూనాలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేస్తుందని పేర్కొన్నారు.

పార్కులపై పట్టింపేది?



పంచతంత్ర పార్కులో విరిగిపోయిన ఆట వస్తువులు

జిల్లాలో అధ్వానంగా మున్సిపల్ ఉద్యానవనాలు

- పని చేయని ఓపెన్ జిమ్‌లు
- అస్తవ్యస్తంగా వాకింగ్ ట్రాక్‌లు..
- పట్టించుకోని పురపాలక అధికారులు



రాజీవ్ పార్కులో పాడైన బల్లలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ఉన్న పార్కులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారాయి. పార్కుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు. మున్సిపల్ నిధులు రూ.లక్షల్లో కేటాయిస్తున్నా పార్కులలో శాశ్వత సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. మరో రెండు రోజుల్లో వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దలతో కలిసి చిన్నారులు ఆడుకునేందుకు సమీప పార్కులకు వెళ్తుంటారు. అయితే వారి ఆటలకు సంబంధించిన పరికరాలు ఎక్కడా పని చేయడం లేదు. అవి తుప్పుపట్టి, ముట్టుకుంటే చిన్నారుల చేతికి గాయాలయ్యే ప్రమాదం నెలకొంది. పార్కుల అభివృద్ధి, నిర్వహణకు రూ.లక్షలు కేటాయిస్తున్నట్లు పేపర్‌పై చూపించడమే తప్ప ఆచరణ లేదని, దీంతో సందర్శకులు అవస్థ పడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో అయినా అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇక నిర్వహణ లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. నాటడానికి తీసుకొచ్చిన మొక్కలు ఎండి కళావిహీనంగా కనిపిస్తున్నాయి.

జిల్లా కేంద్రంలో ఇలా..

కొత్తగూడెంలో ప్రధానంగా రాజీవ్ పార్కు, రైటర్ బస్తీలోని పంచతంత్ర పార్కు, సింగరేణి చిల్డ్రన్ పార్కు, రామవరంలోని వనమా పార్కుతో పాటు పలు మినీ పార్కులు ఉన్నాయి. రాజీవ్ పార్కును 2005లో ఏర్పాటుచేయగా ఆది నుంచీ ఇక్కడ సమస్యలే ఉన్నాయి. వాకింగ్ ట్రాక్ మినహా మిగితావన్నీ మరమ్మతులకు గురయ్యాయి. పిల్లల ఆట పరికరాలు పని చేయడం లేదు. బాత్‌రూమ్‌లు వినియోగంలో లేవు. పార్కంతా పాముల పుట్టలు ఉండడంతో సందర్శకులు భయాందోళన చెందుతున్నారు. ఓపెన్ జిమ్‌లో పరికరాలు కొన్ని పని చేయడం లేదు. అండర్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుపై కనీసం మూత కూడా లేక ప్రమాదకరంగా మారింది. పార్కు ఎంట్రన్స్‌లో ఉన్న ఫౌంటెన్ పని చేయడం లేదు. ఇక పంచతంత్ర పార్కు మరీ దారుణంగా మారింది. రూ.20 లక్షలతో నిర్మించిన ఈ పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఇతర ఆవరణంతా చెత్తతో నిండింది. ఓపెన్ జిమ్ పరికరాలు విరిగిపోయాయి. మున్సిపల్ అధికారులు పార్కు నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో సందర్శకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నెహ్రూ పార్కుదీ అదే పరిస్థితి..

రామవరంలో ఉన్న నెహ్రూ పార్కును ప్రస్తుతం వనమా పార్కుగా పిలుస్తున్నారు. ఈ పార్కుకు అయితే తాళం కూడా తీయడం లేదని స్థానికులు చెబుతున్నారు. మరో రెండు రోజుల్లో వేసవి సెలవులు రానుండగా పార్కులోకి పిల్లలు వెళ్లే అవకాశం లేదని అంటున్నారు. పట్టణంలో పలు ఏరియాల్లో ఉన్న మినీ పార్కులు సైతం అధ్వానంగా మారాయి. ఇక పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని నవభారత్ పార్కు, బొల్లోరిగూడెం పార్కుల నిర్వహణ కొంత మేర బాగానే ఉంది. అయితే వీటిలోనూ చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. మణుగూరు మున్సిపాలిటీలోని రాజుపేట్ ఏరియాలో ఉన్న చిల్డ్రన్ పార్కులోనూ సమస్యలు తాండవిస్తున్నాయి. పార్కు నిర్వహణ సక్రమంగా లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని చెరువు కట్ట పార్కులో మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నారు. దీంతో ఇక్కడ సమస్యలు అంతగా లేవనే చెప్పాలి.

జిమ్ పరికరాలు మరమ్మతు చేయించాలి



రాజీవ్ పార్కులోని ఓపెన్ జిమ్‌లో ట్రైనీని ఏర్పాటు చేయాలి. జిమ్‌లో కొంత సామగ్రి మరమ్మతుకు గురైంది. దీంతో జిమ్ చేసే వారు ఇబ్బంది పడుతున్నాం. మరమ్మతు చేయించాలని మున్సిపల్ అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదు.

– రాజు, బూడిదగడ్డ, కొత్తగూడెం

ఆట సామగ్రి కొత్తవి ఏర్పాటు చేయాలి



పార్కుల్లో పిల్లల ఆట సామగ్రి, పరికరాలు అన్నీ మరమ్మతులకు గురై ఉన్నాయి. కొన్ని అయితే తుప్పు పట్టి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. తుప్పు పట్టిన పరికరాలతో పిల్లలకు గాయాలయ్యే ప్రమాదం ఉంది. అధికారులు చర్యలు చేపట్టి నూతన పరికరాలను ఏర్పాటు చేయాలి.

– చిన్ని, గాజులరాజంబస్తీ

ఆలయాల అప్‌గ్రేడ్..

- ఉమ్మడి జిల్లాలోని పలు దేవస్థానాలకు భక్తుల తాకిడి
- ఖమ్మం జిల్లాలో ఆరు దేవాలయాలు 6ఏ పరిధిలోకి..
- మరో ఆరింటికి 6 బీ హోదా
- భద్రాద్రి జిల్లాలో ఐదు ఆలయాలు 6సీ నుంచి 6బీకి..



6బీ ఆలయంగా అప్‌గ్రేడ్ అయిన పాల్వంచలోని భజన మందిరం

పాల్వంచరూరల్ : ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలను అప్‌గ్రేడ్ చేస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయాలకు భక్తుల తాకిడి పెరుగుతుండగా అంతే స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. దీనికి తోడు ఆలయాల్లో ఏటా బ్రహ్మోత్సవాలు, వార్షికోత్సవాల, ఇతర పండుగ రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది. ఇలా ప్రతీ మూడేళ్లకోసారి ఆలయాల ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుంటున్న దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు వాటికి గ్రేడ్‌లను పెంచుతుంటారు. తద్వారా భక్తులకు ఆలయాల్లో వసతులు కల్పనతో పాటు సిబ్బంది సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది. ఆదాయం ఆధారంగా ఖమ్మం జిల్లాలో ఇప్పటికే ఏడు ఆలయాలకు 6ఏ హోదా ఉండగా కొత్తగా మరో ఆరు ఆలయాలను 6బీ నుంచి 6ఏకు అప్‌గ్రేడ్ చేశారు. భద్రాద్రి జిల్లాలో నాలుగు ఆలయాలు 6ఏ పరిధిలో ఉండగా కొత్తగా ఏ ఆలయమూ అప్‌గ్రేడ్ కాలేదు.

6ఏ ఆలయాలు ఇవే..

ఉమ్మడి జిల్లాలో పాత, కొత్తవి కలిపి మొత్తం 17 ఆలయాలు 6ఏ గ్రేడ్ పరిధిలో ఉన్నాయి. వీటిలో దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయం, పాల్వంచ మండలంలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం, అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం, కొత్తగూడెంలోని శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం(గణేష్ టెంపుల్)తో పాటు జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి, ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి శ్రీ మారెమ్మతల్లి ఆలయం, పెనుబల్లిలోని శ్రీ నీలాద్రీశ్వరస్వామి, ఖమ్మం నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి(గుట్ట), కమాన్‌బజార్ శ్రీ వేంకటేశ్వరస్వామి, కాల్వొడ్డులోని సత్యనారాయణ సహిత వీరాంజయనేయస్వామి, వేంసూరు మండలం కందుకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు గతంలోనే 6ఏ పరిధిలో ఉండగా కొత్తగా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల శ్రీ సంగమేశ్వరస్వామి, మధిరలోని మృత్యుంజయస్వామి, ఖమ్మంలోని శ్రీ గుంటుమల్లేశ్వరస్వామి, ఏన్కూరు మండలం గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి, సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలోని శ్రీ కోటమైసమ్మ తల్లి, ఖమ్మం ఇందిరానగర్ శ్రీ సీతారామచంద్రస్వామి(పర్ణశాల) ఆలయాలు అప్‌గ్రేడ్ అయ్యాయి.

6బీ హోదా పొందిన ఆలయాలు..

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లాపురం శ్రీమల్లికార్జునస్వామి, కొణిజర్ల మండలం పల్లిపాడు శ్రీ శంభులింగేశ్వరస్వామి, కూసుమంచి మండలం పెరికసింగారం శ్రీవేణుగోపాల అంజనేస్వామి, ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్ శ్రీసీతారామాంజనేయస్వామి, కామేపల్లి మండలం కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మ, ఖమ్మం వరదయ్యనగర్‌లోని శ్రీమైసమ్మ అమ్మవారి ఆలయాలు 6బీ హోదా పొందాయి. వీటితో పాటు భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి శ్రీదాసాంజనేయస్వామి, కొత్తగూడెం బాబూక్యాంప్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి, జూలూరుపాడు మండలం పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరస్వామి, పాల్వంచలోని శ్రీ రామాలయం (భజనమందిరం), అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం ఉన్నాయి.

భక్తుల రద్దీ, ఆదాయం ఆధారంగా..



ప్రతీ మూడేళ్లకోసారి ఆలయాలకు భక్తుల తాకిడి, ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు గ్రేడ్‌లు నిర్ణయిస్తారు. ఏడాదికి రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు ఆదాయం ఉంటే 6ఏ, రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంటే 6బీ, రూ.2లక్షల లోపు ఆదాయం లభించే ఆలయాలకు 6సీ హోదా కల్పిస్తాం.

– వీరస్వామి, దేవాదాయ శాఖ ఏసీ

రామాలయ ఉద్యోగుల సంఘం ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నెం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా రవికుమార్ శర్మ, గౌరవాధ్యక్షులుగా మురళీకృష్ణమాచార్యులు, స్థలశాయి, రామస్వరూప్, భవానీ రామకృష్ణ, శ్రావణ్, రవీందర్, కోశాధికారిగా రాకేష్, ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సాయిబాబు, నందా చమ్మరాజు, సతీష్, లక్ష్మణరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ నాయకులు నర్సింహారావు, బాలకృష్ణ, ఉద్యోగులు కత్తి శ్రీనివాస్, కిషోర్, విష్ణుచార్యులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

డీవైఎస్ఓ వరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: మే 1 నుంచి 31 వరకు జరగనున్న వేసవి ఉచిత శిక్షణ తరగతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం. వరంధామరెడ్డి అన్నారు. ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఎన్నికైన 25 మంది కోచ్‌లతో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని దాదాపు 30 ప్రాంతాల్లో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, 14 ఏళ్ల లోపు క్రీడాకారులు ఈ సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా 10 క్యాంప్‌లు మాత్రమే ఉండేవని, ఈ ఏడాది అదనంగా మరో 20 శిబిరాలు ఏర్పాటు చేశామని వివరించారు.

భూ భారతితో అందరికీ మేలు

- కొత్త చట్టంపై ఆందోళన వొద్దు
- కలెక్టర్ జితేష్ పాటిల్ వెల్లడి



మణుగూరుటౌన్ : భూభారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్/అశ్వాపురం : భూ భారతి చట్టంతో రైతుల భూములకు రక్షణతో పాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం ఆయన మణుగూరు, అశ్వాపురం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ చట్టంపై ఎలాంటి ఆందోళనలు, అపోహలు అవసరం లేదని చెప్పారు. భూ బదలాయింపులో ప్రవేశపెట్టిన నిబంధనలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ధరణి కంటే భూ భారతి చట్టంతోనే భూములకు రక్షణ కలుగుతుందన్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వారి సందేహాలను, అనుమానాలను నివృత్తి చేసి, వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భూ భారతి చట్టం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపుతుందని అన్నారు. ఈ చట్టం రైతులకు, ప్రజలకు మాత్రమే కాక రెవెన్యూ అధికారులకు కూడా ధైర్యం ఇచ్చిందని, సమస్య ఎంత తీవ్రమైనదైనా నాలుగంచలతో పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ దామోదర్‌రావు, తహసీల్దార్లు రాఘవరెడ్డి, స్వర్ణలత, ఏడీఏ తాతారావు, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, ఆర్ఐ లావణ్య, సీనియర్ అసిస్టెంట్ కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లంచం అడిగితే ఏసీబీకి పట్టించండి

అశ్వాపురంలో నిర్వహించిన భూ భారతి సదస్సులో రైతుల సందేహాలు తెలపాలని కలెక్టర్ సూచించగా.. ఓ రైతు మాట్లాడుతూ గతంలో ధరణిలో సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు రూ.10 వేల నుండి రూ.లక్ష వరకు లంచాలు తీసుకున్నారని, భూ భారతిలో ఎంత లంచాలు తీసుకుంటారని ప్రశ్నించాడు. డైరెక్ట్‌గా తీసుకుంటే ఏసీబీ అధికారులు పట్టుకుంటున్నారని గ్రామానికి ఓ బ్రోకర్ ద్వారా అధికారులు డబ్బులు తీసుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చాడు. దీంతో కలెక్టర్ మాట్లాడుతూ.. డబ్బు తీసుకోవడం ఎంత నేరమో ఇవ్వడం కూడా అంతే నేరమని అన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఏసీబీ అధికారులకు పట్టించండని చెప్పారు. బ్రోకర్ల ద్వారా తీసుకుంటే ఆధారాలతో తనకు తెలియజేస్తే పోలీసు కేసు పెడతానని చెప్పగా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బోరు పూడ్చివేతపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న గిరిజన రైతులు

చర్ల: చర్ల మండలంలోని పులిగుండాలలో పోడు సాగుదారులు వేసిన బోరును దుమ్ముగూడెం అటవీ రేంజ్ అధికారులు పూడ్చివేయగా.. వారి వైఖరిని నిరసిస్తూ రాళ్లగూడెంలో సోమవారం గిరిజన రైతులు ధర్నా చేశారు. ప్రధాన రహదారిపై రెండు గంటల పాటు బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోగా ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య చేరుకొని రైతులతో మాట్లాడారు. డీఎఫ్ఓతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై వెంటనే విచారణ నిర్వహించాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోరు పూడ్చివేసిన ఘటనపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులకు సూచించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, బాధిత రైతులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పులిగుండాల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోడి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నిక వస్తే బీఆర్‌ఎస్‌దే విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు తదితరులు

- పార్టీ శ్రేణుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత
- మొదట రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం అసెంబ్లీకి ఉప ఎన్నిక వస్తే మళ్లీ గెలిచేది బీఆర్ఎస్ అభ్యర్థేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం స్థానిక హరిత హోటల్‌లో ఉద్యమకారులు, పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. 2023 ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్క భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ గెలిచిందని, 2014, 2018 ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో ఒక్కో సీటు మాత్రమే గెలుచుకున్నామని, అయినా కేసీఆర్ హయాంలో ఉమ్మడి జిల్లాకు భారీగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి 3.50లక్షల ఎకరాలకు నీరందించారని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా కొత్తగా వచ్చిన ప్రాజెక్టులు, ఆస్పత్రులు, హాస్టళ్లు ఏమీ లేవని, ఎమ్మెల్సీలుగా తాను, తాతా మధు చట్టసభల్లో అడుగుతున్న ప్రశ్నలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నీ అబద్ధాలే చెబుతున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో అభివృద్ధే ధ్యేయంగా పని చేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వరి పండుతోందంటే అది కేసీఆర్ చలువేనని చెప్పారు. కార్యకర్తల కష్టంతో భద్రాచలం ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లం వెంకట్రావు ఆ తర్వాత అధికార పార్టీలోకి వెళ్లారని అన్నారు. ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు రేగా కాంతారావు, తాతా మధుసూదన్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి, హరిప్రియనాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, ఆకోజు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి


బూర్గంపాడు/పాల్వంచ/మణుగూరురూరల్ : ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజోతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. సోమవారం ఆమె బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత నివాసంలో, మణుగూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కాగా, భద్రాచలంలో మాజీ మంత్రి వనమా రాఘవేందర్ రావు, కిలారు నాగేశ్వరరావు, బూర్గంపాడు పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, నాయకులు పోశం నర్సింహారావు, వల్లూరిపల్లి వంశీకృష్ణ, జలగం జగదీశ్, గోనెల నాని, సిరిపురపు స్వప్న, భూక్యా శ్రావణి, ఎడ్ల శ్రీనివాస్, యాదగిరిగౌడ్, నూకారపు రమేష్, పాకాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు. మణుగూరులో వపన్ నాయక్ ప్రతాప్ నివాసంలో తేనేటి విందు, ఎక్సలెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్ ఏర్పాటు చేసిన భోజనాన్ని స్వీకరించారు.

ఉద్యమకారులను పట్టించుకోండి

'భద్రాచలంలో మొదట బీఆర్ఎస్ కండువా కప్పుకున్నది మా నాన్న నరసింహామూర్తి. మా ఇంటికి కేసీఆర్, కవితమ్మ వచ్చారు, కానీ జిల్లా నాయకులు మమ్మల్ని పట్టించుకోవడం లేదు, మేం దళితులమనే చిన్న చూపు చూశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఉద్యమకారులకు సముచిత స్థానం ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లా నుంచి పార్టీలో చేరిన పలువురు ఎవరి వర్గానికి వారు పదవులు ఇప్పించుకున్నారు. దీంతో మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు రాలేదు. ఏదేమైనా మాకు కేసీఆరే నాయకుడు. ఇప్పుడున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడికి నా పేరు కూడా తెలియదు' అంటూ భద్రాచలానికి చెందిన రాజేంద్రవర్దన్ ఆవేదన వ్యక్తం చేశాడు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

ఎమ్మెల్సీ కవిత మొదట భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ క్రమంలో సీతారాములను దర్శించుకుని సీతమ్మవారికి సారె సమర్పించి గర్భగుడి నుంచి బయటకు వచ్చిన కవిత 'రామలక్ష్మణ జానకి' అంటూ జేజేలు పలికారు. అనంతరం లక్ష్మీతాయారమ్మ వారి సన్నిధిలో ఆమెకు పండితులు వేదాశీర్వచనం అందజేశారు.



రామాలయం నుంచి బయటకు వస్తున్న కవిత, పక్కన నాయకులు



క్లుప్తంగా

రేణుకకు జ్యోతిష్యంలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రేణుక

బూర్గంపాడు/పాల్వంచ: మండలంలోని అంజనాపురానికి భూక్యా రేణుక జ్యోతిష్యంలో ఆర్యన్ పరిశోధన విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆమె భర్త కిరణ్‌గాంధీ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వివాహ సంతాన అంశంలో పరిశోధన చేసినందుకు గాను రేణుకకు ఈనెల 20న సింహాచలంలో జరిగిన జ్యోతిష్య సదస్సులో డాక్టర్ నరసింహస్వామి, తదితరుల చేతుల మీదుగా డాక్టరేట్ అందించారు.

ఇంటి కొలతల్లో తేడాలు రాకుండా చూడాలి



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్దేశించిన ఇంటి కొలతల్లో తేడాలు రాకుండా చూడాలని గ్రామ కార్యదర్శులను హౌసింగ్ బోర్డు పీడీ శంకర్ ఆదేశించారు. మండల పరిధిలోనితోగ్గూడెంగ్రామపంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లనుసోమవారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేస్తేనే బిల్లులు సకాలంలో లబ్ధిదారులకు అందుతాయన్నారు. ఇప్పటివరకు గ్రామంలో వంద ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని కార్యదర్శి రవికుమార్ పీడీకి వివరించారు.

న్యాయవాద సంక్షేమ నిధి పెంచాలి



కోర్టు ఆవరణలో కరపత్రాలతో న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ కార్పస్ ఫండ్ రూ. 100 కోట్ల నుంచి రూ.500 కోట్లకు పెంచాలని ఏఐఎల్‌యూ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులకు ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులను అందజేయాలని, ఇన్సూరెన్స్‌ను రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. తొలుత సంక్షేమ నిధి పెంచాలని సంతకాల సేకరణ చేశారు. కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ జె.శివరాంప్రసాద్, న్యాయవాదులు కిలారు పురుషోత్తం, గాదె సునంద, ఆరికాల రవికుమార్, డి.రాజేందర్, వైవీ రామారావు, ఏ.పద్మకళ, పగిడిపల్లి రవి, దేవదాసు, రామకృష్ణ, మహేష్, ఆనంద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఎదురుకావొద్దు

డీపీఓ చంద్రమౌళి



మాట్లాడుతున్న డీపీఓ చంద్రమౌళి

దమ్మపేట: వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి కనీసం వంద మంది ఉపాధి హామీ పనులకు వచ్చేలా చూడాలన్నారు. ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి, ఎంపీఓ రామారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేతకు యత్నం

ఇల్లెందు: పట్టణంలోని బుగ్గవాగు ఒడ్డున అక్రమంగా చేపట్టిన నిర్మాణం కూల్చివేతకు మున్సిపల్ అధికారులు సోమవారం యత్నించారు. వాగు ఒడ్డున ఓ గది నిర్మాణం తలపెట్టగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, సిబ్బంది, జేసీబీతో అక్కడికి వెళ్లి కూల్చివేతకు ప్రయత్నించారు. దీంతో నిర్మాణదారులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం కొంత గడువు ఇస్తే తామే తొలగిస్తామని నిర్మాణదారులు పేర్కొనడంతో పోలీసులు, మున్సిపల్ అధికారులు వెనుదిరిగారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

కొత్త క్వార్టర్లు నిర్మించేనా..?

- శిథిలావస్థలో కేటీపీఎస్ నివాస సముదాయాలు
- అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- నిర్మాణాలపై దృష్టి సారించని జెన్ కో యాజమాన్యం





శిథిలావస్థకు చేరిన కేటీపీఎస్ ఉద్యోగుల క్వార్టర్లు (ఇన్ సెట్) వెలవెలబోతున్న కేటీపీఎస్ కాలనీ

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుత్ కర్మాగారాల్లో పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్ కీలక పాత్ర పోషిస్తోంది. కానీ ఇక్కడి ఉద్యోగులకు నివాస సముదాయాలు(క్వార్టర్లు) సక్రమంగా లేవు. దశాబ్దాల క్రితం నిర్మించినవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం నిర్మించిన సమయంలో ఉద్యోగుల కోసం ఏ,బీ,సీ, ఇంటరీమ్డియట్, బాంబే కాలనీలుగా క్వార్టర్ల సముదాయాలు నిర్మించారు. అప్పుడే క్వార్టర్లు నిర్మించినా చాలా ఎత్తు తక్కువ, ఇరుకు గదులతో నిర్మాణాలు చేపట్టారు. సరైన ప్రహరీలు కూడా లేవు. కాలనీల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇప్పటికే ఓఅండ్ఎం కర్మాగారం కాలం చెల్లడంతో ఆ కర్మాగారాన్ని కూల్చివేశారు. క్వార్టర్లు కూడా శిథిలావస్థకు చేరాయి. దీంతో 80 శాతం మంది కార్మికులు క్వార్టర్లను ఖాళీ చేసి ప్రైవేటు ఇళ్లల్లో అద్దెకు ఉంటున్నారు. కొందరు రుణాలు తీసుకుని సొంత ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

శిథిలావస్థకు చేరిన క్వార్టర్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. నిత్యం కొందరు యువకులు, గంజాయి, మద్యం సేవించడం, ఇతర కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఖాళీ క్వార్టర్ల తలుపులు, కిటికీలు, ఐరన్ సామగ్రి చోరీకి గురవుతున్నాయి. కేటీపీఎస్ ఓఅండ్ కర్మాగారం మూతబడటంతో సుమారు 2500 మంది ఉద్యోగ, కార్మికులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. దీంతో కాలనీలు జన సంచారం లేకుండా వెలవెలబోతున్నాయి. గతంలో కన్యూమర్ స్టోర్స్, పాల ప్యాకెట్లు, గ్యాస్ బుకింగ్, గోడౌన్, ఇతర కూల్ డ్రింక్ షాపులు ఉండేవి. ప్రస్తుతం అవన్నీ మూతబడ్డాయి.

నిధుల విడుదలలో జాప్యం

పాల్వంచ కేటీపీఎస్ కేంద్రంగా 5,6దశల కర్మాగారాల్లో వెయ్యి మెగావాట్లు, 7వ దశలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. 1969–78 సంవత్సరంలో ఓఅండ్ఎం కర్మాగారం నిర్మించగా కాలం చెల్లడంతో తొలగించారు. ఆ స్థానంలో 7వ దశ నిర్మాణం జరిపారు. ఇటీవల మణుగూరులో నిర్మించిన బీటీపీఎస్ సిబ్బంది కోసం రూ.600 కోట్లతో క్వార్టర్ల నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ కూడా పాత నిర్మాణాలు తొలగించి వాటి స్థానంలో అపార్ట్‌మెంట్ తరహాల్లో నిర్మాణాలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభం కావడంలేదు. యాజమాన్యం కూడా దృష్టి సారించడం లేదు. దీంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జెన్‌కో యాజమాన్యం స్పందించి క్వార్టర్లను నిర్మించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



కేటీపీఎస్‌లో ఉద్యోగుల కొత్త క్వార్టర్ల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. ఈ విషయం యాజమాన్యం దృష్టిలో ఉంది. త్వరలో మంజూరు అవుతాయని వేచి చూస్తున్నాం.

–కె.శ్రీనివాసబాబు, సీఈ, 7వ దశ

బ్రిడ్జి పాఠశాలలతో సత్ఫలితాలు

- వలస ఆదివాసీ ఆవాసాల్లో ఏర్పాటు
- ఐడీఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ



ఎర్రబోడులోని బ్రిడ్జి పాఠశాల

చంద్రుగొండ : జిల్లాలో ఐటీడీఏ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న బ్రిడ్జి పాఠశాలలు సత్ఫలితాలిస్తున్నాయి. ఐడీఓ (ఇండిజినస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో మూడేళ్లుగా ఈ పాఠశాలలు నడుపుతున్నారు. అటవీప్రాంతాల్లో నివాసముంటున్న వలస గొత్తికోయ ఆదివాసీల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. చంద్రుగొండ మండలం బెండాలపాడుకు మూడు కిలోమీటర్ల దూరంలో గొత్తికోయల ఆదివాసీ ఆవాసం ఎర్రబోడు ఉంటుంది. కనకగిరి అటవీప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు చదువు నేర్పేవారు. నిర్వహణ కష్టతరం కావడంతో ఐసీడీఎస్ అధికారులు కేంద్రం ఎత్తేశారు. ఈ క్రమంలో ఐడీఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్రిడ్జి పాఠశాల ఏర్పాటు చేశారు. 39 మంది చిన్నారులకు 1 నుంచి 3వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని మొత్తం 13 పాఠశాలల్లో 351 మంది పిల్లలు ఉన్నారు. ఇక్కడి మూడో తరగతి పూర్తి చేసినవారిని గత మూడేళ్లల్లో బూర్గంపాడు, ఉలవ్వనూరు, బూర్గంపాడులో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో 500 పిల్లల్ని చేర్పించారు.

జిల్లాలో బ్రిడ్జి పాఠశాలల వివరాలు

మండలం	గ్రామం	పిల్లల సంఖ్య
లక్ష్మీదేవిపల్లి	క్రాంతినగర్	31
పాల్వంచ	సిర్‌తన్‌పాడు	23
పాల్వంచ	కోయగట్టు	34
పాల్వంచ	రాళ్లచిలుక	26
పాల్వంచ	సీతారాంపురం	40
చుంచుపల్లి	జగ్గారం	26
చంచుపల్లి	పాలవాగు	18
పినపాక	ఎర్రకుంట	32
పినపాక	ఉమేష్‌చంద్రనగర్	28
మణుగూరు	బుడుగుల	24
ములకలపల్లి	రాచన్నగూడెం	23
చంద్రుగొండ	బెండాలపాడు	31
టేకులపల్లి	ఒంటిగుడిసె	15

ఆకర్షించేలా విద్యాబోధన



గొత్తి కోయ ఆదివాసీ పిల్లలను ఆకర్షించేలా విద్యాబుద్ధులు నేర్పుతున్నాం. అక్షరాలను నేర్పడమే కాకుండా కవితలు, కథలు నేర్పిస్తున్నాం. ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

–పద్దం విజయకుమారి, వలంటీర్, బెండాలపాడు

ఆటపాటలతో నేర్పుతున్నారు..



బ్రిడ్జి పాఠశాలలో విద్యాబోధన బాగుంది. చిన్నపిల్లలకు ఆటపాటలతో అక్షరాలు నేర్పుతున్నారు. మా ఆవాసంలో పిల్లలంతా క్రమంతప్పకుండా పాఠశాలకు వెళ్తున్నారు.

–రవ్వా రమేష్, ఆదివాసీ పెద్ద, ఎర్రబోడు

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

ఆవేదన చెందుతున్న రైతులు



తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

మణుగూరు టౌన్: మండలంలోని సమితిసింగారం గ్రామంలో ఆరబెట్టి ధాన్యం ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిపోయింది. దీంతో సోమవారం ఉదయం ధాన్యాన్ని చూసిన రైతులు కన్నీరుమున్నీరయ్యారు. సుమారు 80 ఎకరాల రైతులు లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద పట్టాలు వేసి వడ్లు ఎండబోశారు. పది రోజుల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా గన్నీ సంచులు లేవంటూ అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ వస్తుందని సొసైటీలో విక్రయించేందుకు వేచి చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం తడిసిందని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని కటింగ్ లేకుండా సొసైటీలో కొనాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పీఏసీఎస్ సొసైటీ కార్యదర్శిని వివరణ కోరగా.. నాలుగు రోజుల క్రితం కేంద్రం ప్రారంభించామని, గన్నీ బ్యాగులు లేకపోవడంతో కొనుగోళ్లు చేపట్టలేదని, మంగళవారం నుంచి కొంటామని తెలిపారు.

బైక్‌ల చోరీ.. నంబర్ మార్చి విక్రయం

రెండు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లతో ఏసీపీ, సీఐ, ఎస్ఐ, సిబ్బంది

పెనుబల్లి: జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేయడమే కాక నంబర్ ప్లేట్లు మార్చి ఇతరులకు అమ్ముతున్నారు. ఇప్పటివరకు 18 బైక్‌లను చోరీ చేసిన వీరు వీఎం బంజర్ పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలను వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కల్లూరు ఏసీపీ కె.రఘు, సత్తుపల్లి రూరల్ సీఐ ఎంఎల్.ముత్తిలింగయ్యగౌడ్, వీఎం బంజర్ ఎస్ఐ కె.వెంకటేశ్ వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట అర్బన్ కాలనీకి చెందిన మక్కెళ్ల నాగరాజు, సత్తుపల్లి మండలం తుంబూరుకు చల్లా శివప్రసాద్ వీఎం బంజర్, సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా పెద్దవేగి స్టేషన్ పరిధిలో రూ.12.45 లక్షల విలువైన 18 ద్విచక్రవాహనాలను చోరీ చేశారు. వీటిలో కొన్నింటి నంబర్ మార్చి పెనుబల్లి మండలం గంగదేవిపాడు, అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం వాసులకు అమ్మగా, వచ్చిన డబ్బుతో జల్సాలు చేశారు. మిగతా వాహనాలను ఎన్ఎస్‌పీ కాలువ పక్కన పొదల్లో దాచి అందులో రెండింటిని అమ్మేందుకు వెళ్తుండగా ఆదివారం సాయంత్రం ఖమ్మం వైపు నుంచి వీఎంబంజర్ వైపు వెళ్లే మార్గంలో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. ఎలాంటి పత్రాలు లేకపోగా, తడబడుతుండడంతో వాహనాల చాయిస్ నంబర్ ఆధారంగా ప్రశ్నించడంతో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. దీంతో నాగరాజు, శివప్రసాద్‌ను అరెస్ట్ చేయడమే కాక వీరి నుంచి వాహనాలు కొనుగోలు చేసిన పెనుబల్లి మండలం గంగదేవిపాడుకు చెందిన ఓర్సు వెంకటనారాయణ, పందేళ్ల సింహాద్రి, తిరుమలకొండ కొండల్‌రావు, బత్తుల కొండల్ రావు, అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురానికి చెందిన డేరంగుల నాగసాయి, ఉప్పతాల సతీశ్, ఉప్పతాల గోపి, ఉప్పతాల రాజుపైనా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ రఘు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ వెంకటేశ్, కానిస్టేబుళ్లు శ్రీగాద రాజమల్లు, పి.వెంకటేశ్వర్లు, మోహిద్ పాషా, బాలకృష్ణ, సురేశ్‌ను ఏసీపీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

వడదెబ్బతో మహిళ మృతి



వజ్రమ్మ(ఫైల్)

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన తొటం వజ్రమ్మ(60) కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. రెండు రోజుల క్రితం వడదెబ్బకు గురికాగా భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సోమవారం వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

బైక్‌ను లారీ ఢీకొని ఒకరు..

బూర్గంపాడు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణానికి చెందిన పసుపుతోట నాగేశ్వరరావు (65) బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలోని ఓ మిల్లులో పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో లక్ష్మీపురం బంకు సమీపంలో పాల్వంచ వైపు నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నాగేశ్వరరావు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బొగ్గు చోరీ

ఇల్లెందు: సింగరేణి బొగ్గు అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెక్యూరిటీ విభాగం పట్టుకుని పోలీసులకు అప్పగించింది. సోమవారం మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన బి.రాజు, కె.ప్రసాద్‌లు ఓ ట్రాక్టర్ ద్వారా సింగరేణి బొగ్గు చోరీ చేసుకుని వెళుతుండగా రాజీవ్‌నగర్ తండా వద్ద పట్టుకున్నారు. ఎస్అండ్‌పీసీ సిబ్బంది రామస్వామి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి సూర్య కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

మద్యం మత్తులో దాడి

ఇల్లెందు: మండలంలోని ధనియాలపాడు గ్రామానికి చెందిన పి.రమాదేవి ఇంటికి సోమవారం సుదిమళ్లకు చెందిన ఆమె సమీప బంధువు వచ్చాడు. మద్యం తాగి అల్లరి చేస్తుండటంతో ప్రశ్నించిన రమాదేవి, ఆమె కుమారుడు సంతోష్‌ను తీవ్రంగా దాడి చేసి గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ హసీనా కేసు నమోదు చేశారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వ కృషి

ఎమ్మెల్యే వెంకట్రావు, పీఓ రాహుల్



హాస్టల్‌లో భోజనశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, పీఓ తదితరులు

భద్రాచలం: గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ బి.రాహుల్ పేర్కొన్నారు. సోమవారం భద్రాచలం పట్టణంలో కొర్రాజుల గుట్ట ఏరియాలోని ఏహెచ్ఎస్ బాలుర ఆశ్రమ పాఠశాలలో రూ.25.50లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రీ ఫ్యాబ్రికేటెడ్ భోజనశాలను ఆయన ఐటీటీపీ పీఓతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, ఇందుకోసం వేసవి సెలవుల్లో తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

సమస్యలపై గిరిజనులు సమర్పించే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని పీఓ రాహుల్ అధికారులకు సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి, పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ అధికారులు మణెమ్మ, నాగార్జున రావు, రవీంద్రనాథ్, చంద్రశేఖర్, అశోక్ కుమార్, నరేందర్, హరీష్, శ్రీనివాస రావు, ప్రసాద్, మోహన్, రాంబాబు, భాస్కరన్, లక్ష్మీనారాయణ, మనిధర్, ఉదయ్ కుమార్, నరేష్, నారాయణ రావు, ఆదినారాయణ, హరికృష్ణ, లింగా నాయక్ పాల్గొన్నారు.

గాంధీపురం రైల్వేగేట్‌లో సాంకేతిక లోపం

కారేపల్లి: మండలంలోని ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిపై గాంధీపురం వద్ద రైల్వేగేట్ సోమవారం సాంకేతిక లోపంతో తెరుచుకోలేదు. దీంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు గంట పాటు గేట్ మూతపడి ఉండడంతో, ఉద్యోగులు అతి కష్టంపై మరమ్మతులు చేపట్టారు. అయితే, గాంధీపురంతో పాటు, కారేపల్లిలోని ఇల్లెందు రైల్వేగేట్, పేరుపల్లి గేట్ల మీదుగా వాహనాల రద్దీ ఉంటుంది. ఇక్కడ ట్రాక్‌పై ప్రతీ 20 నిమిషాలకో గూడ్స్ వచ్చి వెళ్తుండడం.. ఆ సమయాన గేట్లు మూసివేయడం.. తరచుగా సాంకేతిక లోపంతో తెరుచుకోక వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి ఫ్లైఓవర్ లేదా అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య



లాలు (ఫైల్)

టేకులపల్లి: అనారోగ్యం, అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. టేకులపల్లి ఎస్ఐ ఎ.రాజేందర్ కథనం ప్రకారం... మండలంలోని బావోజీతండాకు చెందిన భూక్య లాలు(35) కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. ఇటీవల శస్త్రచికిత్స నిర్వహించగా రూ.4 లక్షల అప్పు అయింది. దీనికి తోడు పంటలు కూడా సరిగా పండలేదు. దీంతో అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది సోమవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గడ్డి మందు తాగి ఒకరు..

ఇల్లెందు: మండలంలోని రొంపేడు గ్రామానికి చెందిన జి. భద్రూ(55) సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ హసీనా కథనం ప్రకారం.. భద్రూ మద్యం బానిసగా మారడంతో కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. దీంతో మద్యం మత్తులో ఉన్న ఆయన ఇంట్లో గడియ వేసుకుని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వేధింపుల కేసు నమోదు

చంద్రుగొండ: వివాహితను అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో భర్త, అత్తలపై సోమవారం పోలీసులు కేసు నమోద్దు చేశారు. ఎస్ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండల పరిధిలోని టేకుల బంజర గ్రామానికి చెందిన సోనుకు టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లికి చెందిన వీరన్నతో గతేడాది వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నం కానుకలిచ్చారు. కాగా అదనపు కట్నం తేవాలని సోనును భర్త వీరన్న, అత్త లక్ష్మి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద మృతిపై విచారణ

మణుగూరు టౌన్: ఓ వివాహిత మరణించిన ఘటనలో పోలీసులు సోమవారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ సోమ సతీష్ కథనం ప్రకారం.. సింగరేణిలో ఉద్యోగం నిర్వహించే అమీన్‌ఖాన్‌కు కొత్తగూడెం చుంచుపల్లికి చెందిన హసీనా బేగం(38)తో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. ఈ నెల 6న అమీన్‌ఖాన్ తన మామ హమీద్‌కు ఫోన్ చేసి హసీనా బాత్రూంలో జారి పడిపోయిందని, స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు కొత్తగూడెం తరలించామని తెలిపాడు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, ఈ నెల 11న మృతి చెందింది. కుటుంబ సభ్యులు బ్రెయిన్‌డెడ్‌గా భావించి కొత్తగూడెం మున్సిపాలిటీలోని ఖబరస్తాన్‌లో ఖననం చేశారు. కాగా అమ్మను నాన్న రాత్రిపూట గోడకేసి కొట్టడంతో ముఖం వాచిందని, తర్వాత రోజు బాత్రూంలో వెళ్లి పడిపోయిందని మృతురాలి పిల్లలు తాత హమీద్ దగ్గర ఈ నెల 13న కన్నీరుమున్నీరయ్యారు. దీంతో మృతురాలి తండ్రి హమీద్ తన కూతురిని అల్లుడు అమీన్ ఖాన్ కొట్టి చంపాడని ఫిర్యాదు చేయగా, మణుగూరు సీఐ సతీష్ కుమార్ లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ రామకృష్ణారావు సమక్షంలో ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీశారు. కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ వైద్య బృందం ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశామని, మెడికల్ రిపోర్టు ఆధారంగా దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

బోర్ వెల్ వాహనం సీజ్

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు–బీ బీట్‌లోని ఆర్ఎఫ్ఆర్ పాత పట్టా కలిగిన భూమిలో పాపకొల్లుకు చెందిన ఓ రైతు ఆదివారం రాత్రి బోరు వేయిస్తుండగా అటవీ సెక్షన్ ఆఫీసర్ వి.మల్లయ్య, బీట్ ఆఫీసర్ కె విజయలక్ష్మి వెళ్లి అడ్డుకున్నారు. బోర్ వెల్ వాహనాన్ని జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ కార్యాలయానికి తరలించారు. బోర్‌వెల్ యజమాని పుల్లారావుపై కేసు నమోదు చేసి, రూ 20 వేలు జరిమానా విధించినట్లు ఎఫ్ఎస్ఓ తెలిపారు.

బిషప్‌పై కేసు కొట్టివేత

భద్రాచలంటౌన్: పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2013లో బిషప్ ఆనంద్ పాల్‌పై నమోదైన కేసును సోమవారం జ్యుడీషల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్ కొట్టివేశారు. బిషప్ ఆనంద్ పాల్‌తోపాటు మరో ఇద్దరు మహిళలు సోడి కృపమ్మ, సుశీలను న్యాయమూర్తి విచారించారు. ముగ్గురిపై మోపిన అభియోగం నిరూపణ కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. న్యాయవాదులు విద్యాసాగర్, అంబేద్కర్, నాగరాజు, శారద వాదించారు.

గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి భద్రాచలం పట్టణం మీదుగా తరలిస్తున్న నిషేధిత ఎండు గంజాయిని ఖమ్మం ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల కథనం ప్రకారం.. కూనవరం రోడ్డులోని ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని ఆపి తనిఖీ చేయగా బ్యాగులో 11 కిలోల గంజాయి లభ్యమైంది. విచారించగా ఒడిశాకు చెందిన వారు దామూ హంటల్, భీమా గుట్టలుగా తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, ద్విచక్రవాహనం, రెండు సెల్ ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో పట్టణంలోని కొర్రాజులగుట్ట, దుమ్ముగూడెం మండలం చిన్ననల్లబల్లి, పర్ణశాల గ్రామాల్లో ఐదుగురు వ్యక్తుల నుంచి 22 లీటర్ల సారాని స్వాధీనం, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

102 వాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

ములకలపల్లి: 102 వాహనాన్ని ట్రాక్టర్ ఢీ కొట్టిన ఘటన సోమవారం జరిగింది. మండల పరిధిలోని మొగరాలగుప్పకు చెందిన కీసరి వీరస్వామి ట్రాక్టర్ పాల్వంచ వైపు నుంచి గ్రామానికి వస్తోంది. ఈ క్రమంలో పాతూరు సమీపంలో పాల్వంచ వైపు వస్తున్న 102 వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. 102 వాహనం ముందుభాగం స్వల్పంగా దెబ్బతిన్నది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ తెలిపారు.